క్లుప్తంగా

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా


ముద్దమల్ల భార్గవ్

భూపాలపల్లి రూరల్: మాజీ రైతుబంధు రాష్ట్ర కమిటీ సభ్యుడు ముద్దమల్ల భార్గవ్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటనలో పేర్కొన్నాడు. భార్గవ్ 1997 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. భూపాలపల్లి టీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా పని చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర రైతు బంధు సమితి కమిటీ సభ్యుడిగా పనిచేశాడు, పార్టీలోతదితర పదవులు చేపట్టాడు. భూపాలపల్లి మండల అటవీగ్రామాల్లో సమర్థవంత నాయకుడిగా గుర్తింపు పొందాడు. వ్యక్తిగత కారణాలతో పార్టీకిరాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని జగదాంబ సెంటర్‌లో అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా సోమవారం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటాపురం సీఐ బండారి కుమార్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను ఆదర్శంగా తీసుకొని మరికొందరు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిడెం సాంబశివరావు(శివ) మన్నెం సునీల్, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్, ముత్తినేని భాస్కర్, రంజిత్, శశికుమార్ తదితరులు ఉన్నారు.

నాసిరకం సిమెంట్‌తో కాల్వల నిర్మాణం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 6వ వార్డులో నాసిరకం సిమెంట్‌తో మురుగు కాలువల నిర్మాణం చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఐఎస్ఐ గ్రేడ్, కాంక్రీట్‌కు సరిపడేది కాదని కాలనీవాసులు వాపోతున్నారు. కాల్వల నిర్మాణం నాలుగు కాలాలపాటు ఉండాల్సిన కాల్వలు మూన్నాళ్ల ముచ్చటే అన్నట్లుగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సైతం నాణ్యత విషయంలో ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేయకుండా కమీషన్లకు కక్కుర్తి పడి రికార్డులు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

క్రైస్తవులు ఆదర్శంగా జీవించాలి

నల్లబెల్లి : బైబిల్ వ్యాఖ్యానుసారం క్రైస్తవ కుటుంబాలు ఆదర్శంగా జీవించాలని ప్రసంగికులు రెవరెండ్ బీపీ.సైరస్ కుమార్, రెవరెండ్ ఎస్తేర్ రాణి కోరారు. స్థానిక పాస్ట్రేట్ చైర్మన్ రెవరెండ్ ఈపీ.ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్ఐ దేవాలయంలో సోమవారం నిర్వహించిన ఆదర్శమైన కుటుంబ సదస్సుకు సైరస్ కుమార్, ఎస్తేర్ రాణి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. భార్యాభర్తలు పొరుగువారికి ఆదర్శంగా నిలిచేలా జీవించాలని సూచించారు. ధనాపేక్ష, స్వార్థం లేకుండా ఒకరికొకరు కట్టుబడి ఏకాభిప్రాయంతో జీవనం సాగించాలని చెప్పారు.

మల్హర్ : హోలీ సంబురాల్లో తాడిచర్ల వాసులు



గణపురం : వేడుకల్లో పాల్గొన్న మహిళలు



మొగుళ్లపల్లి: వేడుకల్లో పాల్గొన్న స్థానికులు



ఉత్సాహంగా హోలీ సంబురాలు

మల్హర్ : అన్ని గ్రామాల్లో హోలీ సంబురాలను యువతీ, యువకులు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. మల్హర్ మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా కులమతాలకతీతంగా ఒకరికొకరు రంగులు చల్లుకుని సంబురాలు జరుపుకున్నారు.

గణపురం : మండలంలో సోమవారం హోలీ పండుగ వేడుకలు మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హోలీ సందర్భంగా పిల్లలు, యువకులు,మహిళలు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. హోలీ సందర్భంగా మండలకేంద్రంలోని కాకతీయ కళాక్షేత్రం కోటగుళ్లలో గణపేశ్వరున్ని మోదుగుపూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం హోలీ వేడుకలను పిల్లలు, యువత ఘనంగా నిర్వహించారు. యువకులు,వివిధ పార్టీ నాయకులు ఒకరికొకరు రంగులు పూసుకుని హోలీ వేడుకలు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోలీ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో యువత పిల్లలు పాల్గొన్నారు.

కాటారం: మండలంలో హోలి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పిల్లలు, పెద్దలు, తేడా లేకుండా, మహిళలు ఒకరికి ఒకరు రంగులు చల్లుకొని ఆనందంగా గడిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సబ్ డివిజన్ పరిధిలోని సీఐ, ఎస్సైలు హోలీ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, సీఐలు నాగార్జునరావు, రాజేశ్వరరావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్, భవానీసేన్, మహేందర్, నరేశ్, యువకులు, మహిళలు పాల్గొన్నారు.


మహదేవపూర్: హోలీ సంబురాలు జరుపుకుంటున్న యువకులు

మహాముత్తారం: హోలీ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని యువకులు రంగులు చల్లుకుని ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. మహిళలు సైతం వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంతోపాటు ఇతర గ్రామల్లో హోలీ పండుగ సంబురాలు యువకులు ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా యువకులు ఒకరికి ఒకరు రంగులు చల్లుకుంటు డప్పుచప్పుళ్లతో వీధుల గుండా తిరుగుతూ శుభకాంక్షలు చెప్పుకుంటూ హోలి సంబురాలు ఘనంగా జరుపుకున్నారు.

చిట్యాల : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. కులమతాలకతీతంగా, చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు పూసుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రేగొండ/టేకుమట్ల: మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో హోలీ సంబురాలు ఉత్సాహంగా జరుపుకున్నారు.


కాటారం : పోలీస్ స్టేషన్‌లో సీఐలు, ఎస్సైలు


టేకుమట్లలో..


మహాముత్తారం: మండల కేంద్రంలో హోలీ వేడుకల్లో యువకులు


రేగొండ: హోలీ వేడుకల్లో పాల్గొన్న కొత్తపల్లిగోరి గ్రామస్తులు


చిట్యాల: వేడుకల్లో పాల్గొన్న ఎస్సై, యువకులు

భరతనాట్యంలో విద్యార్థిని ప్రతిభ


ప్రశంసపత్రంతో అలకనంద రాథోడ్

మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోతు రాజుకుమార్–దివ్య దంపతుల కుమార్తె అలకనంద రాథోడ్ హైదరాబాద్‌లో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భరతనాట్య సంస్కృతిక ప్రదర్శన పలువురుని ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ దైవాంశ శర్మ హాజరై మాట్లాడుతూ అంతరించి పోతున్న భారత కలలకు పుట్టినిల్లుగా పిలువబడే భరత నాట్యాన్ని చదువుతో పాటు భరత నాట్యప్రదర్శన కళను ఎంచుకోవడం సంతోషమని కొనియాడారు. విద్యార్థిని అలకనంద రాథోడ్‌ని శాలువాతో సత్కరించి, ప్రశంసాప్రతాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, సినీప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్ చైర్మన్ చెప్యాల రామారావుపై పెట్టిన అవిశ్వాసంపై మంగళవారం సొసైటీ కార్యాలయంలో ఓటింగ్ జరగనుంది. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఏడుగురు డైరెక్టర్లు గత ఫిబ్రవరి 29న డీసీఓకు వినతిపత్రం అందించిన విషయం తెలిసిందే. సొసైటీలో 13 మంది డైరెక్టర్లలో రామారావును సంఘం చైర్మన్‌గా ఎన్నైకున్నారు. ఓ డైరెక్టర్ అనారోగ్యంతో మృతి చెందగా ప్రస్తుతం చైర్మన్‌తో కలిపి 12 మంది డైరెక్టర్లు ఉన్నారు. చైర్మన్ ఎన్నిక నాటికి 8 మంది బీఆర్ఎస్ డైరెక్టర్లు, ఐదుగురు కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లు ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం కాంగ్రెస్ సంఖ్యా బలం 7కు పెరిగింది. అవిశ్వాసం నెగ్గాలంటే 9 మంది ఓటింగ్‌లో పాల్గొనాలి. కానీ ఇప్పటికే బీఆర్ఎస్ డైరెక్టర్లు ఐదుగురు క్యాంప్‌కు తరలివెళ్లారు. ఏదేమైనా మంగళవారం చైర్మన్‌పై పెట్టిన అవిశాసం తీర్మానం నెగ్గుతుందా లేక వీగుతుందా అని మండలంలో సర్వత్రా చర్చ కొనసాగుతోంది.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

- పస్రా ఎస్సై కమలాకర్
- నలుగురిపై కేసు నమోదు


సోమలగడ్డ క్రాస్ వద్ద సీజ్ చేసిన వాహనాలతో ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ హెచ్చరించారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలోని సోమలగడ్డ క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న పన్నాల శ్రీనివాస్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ముగ్గురు కలిసి ఇసుకను అక్రమంగా నిల్వ చేసి జేసీబీ సాయంతో టిప్పర్ ద్వారా వేరే జిల్లాలకు అధిక రేట్లకు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడులు నిర్వహించగా ఎడ్ల శ్రీకాంత్ (కాసిందేవపల్లి), నాయిని నరేష్ (లింగాపూర్) అంబాల నరేందర్ (రంగాపూర్), గంగుల రాజు (జంగాలపల్లి)లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కమలాకర్ మాట్లాడుతూ ఇసుకను ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దామెర : బైక్ అదుపుతప్పి తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ల్యాదెళ్లలో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన సంగాల రాజు గురువారం ఒగ్లాపూర్‌లోని అతని బంధువు మృతిచెందడంతో అక్కడికి వెళ్లివస్తున్నాడు. గ్రామం సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి రాజు కిందపడ్డాడు. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆదివారం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి రాజు మృతి చెందాడు. మృతుని తండ్రి సంగాల శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఆశిరెడ్డిపల్లిలో కల్యాణం జరిపిస్తున్న పండితులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్పయాగం, ద్వాదశారాధన, సప్తవర్ణాలు, రథోత్సవం కార్యక్రమాలతో పాటు, కల్యాణ కార్యక్రమాన్ని వేద మంత్రోచ్ఛరణ మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెలిశెట్టి స్వర్ణలతసురేష్, ఉప సర్పంచ్ దూబల రాజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాఘవాపూర్‌లో

మండలంలోని రాఘవాపూర్ శివారులో ప్రతీ సంవత్సరం నిర్వహించే శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని అశేష జనవాహిని మధ్య వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రత్యేక మొక్కులు చెల్లించారు. పలు గ్రామాల భక్తులు హాజరై మొక్కులు చెల్లించారు.

బన్న అయిలయ్యకు సన్మానం


అయిలయ్య దంపతులను సన్మానిస్తున్న దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం బాధ్యులు

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బన్న అయిలయ్యను హనుమకొండలోని విజయపాల్ కాలనీలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం బాధ్యులు సోమవారం సన్మానించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో అయిలయ్య దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బిల్ల మహేందర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నున్న నరసమ్మ, జిల్లా ఉపాధ్యక్షుడు కడుదల సోమన్న, కార్యదర్శులు స్వరూప, మల్లికార్జున్, చారి, దామోదర్, నాట్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- వైభవంగా వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర
- మొక్కులు సమర్పించుకున్న భక్తులు


హసన్‌పర్తి: స్వామివారి శోభాయాత్ర

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హసన్‌పర్తి – భీమారం గ్రామాలు సంయుక్తంగా ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నాయి. ఆయా గ్రామాల నుంచి అలివేలు మంగ వేంకటేశ్వర స్వాముల ప్రతిమలను రథాలపై ప్రతిష్ఠించి గ్రామాల పురవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 5గంటలకు కోలాటాల మధ్య ప్రారంభమైన శోభాయాత్ర రాత్రి 9గంటలకు ఎర్రగట్టు దేవాలయానికి చేరుకుంది.

వైభవంగా శోభాయాత్ర

స్వామివారి శోభాయాత్ర సందర్భంగా భక్తులు ఎదురొచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. మేళతాళాలు, కోలాటాల మధ్య శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు గురుమూర్తి శివకుమార్, జక్కుల రజిత, అరుణకుమారి, ఆలయ ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు వెంకటస్వామి, రమణ, సురేష్, కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం, జె.రవి, వెంకన్న, ఆకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగు రథాల ఊరేగింపు

బ్రహోత్సవాలను పురస్కరించుకుని దేవన్నపేట నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు ఏనుగు ప్రతిమల రథాల ఊరేగింపు సాగింది. ఊరేగింపును భక్తులు ఆసక్తిగా తిలకించారు. దేవన్నపేకు చెందిన సూరం వంశానికి చెందిన వారు ప్రతిఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

కల్వర్టులతో పొంచి ఉన్న ప్రమాదం

- మూలమలుపు వద్ద కానరాని సూచిక బోర్డులు
- తరుచూ రోడ్డు ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


రామప్ప రహదారిలో మూలమలుపు వద్ద లేని సూచిక బోర్డులు

వెంకటాపురం(ఎం) : బైక్ అతివేగంతో పాటు కల్వర్టు వద్ద ఎగుడుదిగుడుగా ఉండడంతో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదానికి కల్వర్టే ప్రధాన కారణమని ప్రజలు చర్చించుకుంటున్నారు. వెంకటాపురం నుంచి రామప్పకు వెళ్లే రహదారిలో పలుచోట్ల మూలమలుపులతో పాటు కల్వర్టుల వద్ద రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మూలమలుపుల వద్ద కనీసం సూచికబోర్డులు కూడ అర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు చెందిన కొమ్మలు కూడా రోడ్డుపైకి రావడంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. రామప్పకు వెళ్లే దారిలో మూడుచోట్ల మూలమలుపులు, ఆరు కల్వర్టులు ఉన్నాయి. కల్వర్టు ఎక్కేటపుడు, దిగేటపుడు ఎగుడుదిగుడు ఉండడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నాయి. అర్‌అండ్‌బీ అధికారులు గతంలో ఎగుడుదిగుడుగా ఉన్న ప్రాంతంలో కంకరతో బీటీ పోసినప్పటికీ ఫలితం లేకపోయింది. సోమవారం హోలీ సందర్భంగా రామప్ప చెరువు వద్ద కాలువలో స్నానం చేసి ఇంటికి వెళ్తున్న ఇద్దరు యువకులు లక్ష్మీపురం శివారులోని కల్వర్టు వద్ద బైక్‌ను కంట్రోల్ చేయలేకనే చెట్టుకు ఢీకొని మృతిచెందారని ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. అదేవిధంగా నల్లకాలువ మూలమలుపు వద్ద పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. గతంలో రామప్ప ఆలయ పూజారి సంతోష్ కూడా నల్లకాలువ మూలమలుపు వద్ద ద్విచక్రవాహనంపై నుంచి పడి మృతిచెందాడు. అదే ప్రదేశంలో రెండు కార్లు బోల్తాపడ్డాయి. 2013లో ఆదిలాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా మరణించారు. గత సంవత్సరం స్కూల్ బస్సు సైతం పొలాల్లోకి దూసుకపోయింది. సంబంధిత అధికారులు స్పందించి సూచికబోర్డులు ఏర్పాటు చేయడమే కాకుండా కల్వర్టుల వద్ద ఎగుడుదిగుడు లేకుండా బీటీతో రోడ్డును పోయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.


ప్రమాదానికి కారణమవుతున్న కల్వర్టులు ఇవే..

క్రీడల్లో గెలుపోటములు సహజం



హసన్‌పర్తి: క్రీడల్లో గెలుపోటములు సహజమని కిట్స్ కళాశాల అదనపు కార్యదర్శి వొడితల సతీష్‌బాబు అన్నారు. కిట్స్ కళాశాల మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన కిట్స్ ట్రోఫీ పోటీలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి సమగ్ర వికాసానికి క్రీడలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందుతాయని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో కిట్స్ ఏఓ రమేష్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.